క్లుప్తంగా

జాబ్ మేళాలో 86 మంది ఎంపిక



ఉద్యోగ నియామక పత్రాలతో విద్యార్థులు

అమలాపురం టౌన్: వివిధ కంపెనీల వారు స్థానిక శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళాలో 86 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చాయి. టీసీఎస్, బీటీఎస్, దివాస్ తదితర కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాలో ఆయా కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఉద్యోగాలు పొందిన విద్యార్థులకు కంపెనీల ప్రతినిధులు నియామకపత్రాలు అందించారు. కొత్తగా ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులను కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ కేవీ ఆర్ఎస్ నరసింహారావు, ప్రిన్సిపాల్ కె.మనోహర్, ఏఓ కరాటం ప్రవీణ్, అధ్యాపకులు అభినందించారు.

సబ్ రిజిస్ట్రార్ రాంబాబుకు సత్కారం



సబ్ రిజిస్ట్రార్ రాంబాబును సత్కరిస్తున్న సొసైటీ సభ్యులు

అమలాపురం రూరల్: ఏపీ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ గెజిటెడ్ ఆఫీసర్ల సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నికైన ముమ్మిడివరం సబ్ రిజిస్ట్రార్ రాయి రాంబాబును బాబూ జగ్జీవన్‌రామ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు అభినందించారు. సొసైటీ అధ్యక్షుడు మోకాటి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో శుక్రవారం వేమవరప్పాడులోని రాంబాబు స్వగృహంలో ఆయనను కలిసి ఘనంగా సత్కరించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ రాంబాబు అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర గెజిటెడ్ ఆఫీసర్ల సంఘ సంయుక్త కార్యదర్శిగా ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. సొసైటీ ప్రతినిధులు కాప నాగభూషణం, తొత్తరమూడి ప్రభాకర్‌రావు, చేట్ల సత్యనారాయణ, ఉందుర్తి సత్యనారాయణ, మందా వెంకటేశ్వరరావు, కొదమంచిలి కృష్ణ, కొదమంచిలి సాయికుమార్, కొదమంచిలి అంజిబాబు, ఉందుర్తి గంగాధర్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు అందజేసిన స్టేషనరీ, పుస్తకాలు

అల్లవరం: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని దివంగత మధుర అమృత జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు ఓడలరేవు ఎంపీపీ పాఠశాల విద్యార్థులు, అంగన్‌వాడీ పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, స్టేషనరీ కిట్లను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం పాల వెంకటేశ్వరరావు, మధుర ప్రదీప్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్యానల్ కమిటీల ఎన్నికలు

అమలాపురం టౌన్: మున్సిపల్ కౌన్సిల్‌లో ప్యానల్ కమిటీల ఎన్నికలకు శనివారం శ్రీకారం చుడుతున్నారు. ఇటీవల జరిగిన అనేక కౌన్సిల్ సమావేశాల్లో పలువురు కౌన్సిలర్లు ప్యానల్ కమిటీలు ఎప్పుడు వేస్తారని నిలదీసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ప్యానల్ కమిటీల్లో భాగమైన కాంట్రాక్ట్, ఉపాధ్యాయేతర పోస్టుల నియామక కమిటీని ఎన్నుకునేందుకు కౌన్సిల్ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్టు మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి ఓ ప్రకటనతో తెలిపారు. కాంట్రాక్ట్, ఉపాధ్యాయేతర పోస్టుల నియామక కమిటీలకు సంబంధించి ఒక్కో కమిటీలో ఏడుగురు సభ్యులు ఉండేలా కౌన్సిలర్లు ఎన్నుకోవాల్సి ఉందని ఆమె తెలిపారు.

నవోదయకు విద్యార్థిని ఎంపిక



గంధం రిషిక స్వరిణి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలోని నేతాజీ పబ్లిక్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థిని గంధం రిషిక స్వరిణి ప్రతిష్టాత్మకమైన జవహర్ నవోదయకు ఎంపికైంది. మడికి గ్రామానికి చెందిన ఆ విద్యార్థిని స్కూల్ యాజమాన్యం ప్రోద్బలంతో జవహర్ నవోదయ ప్రవేశ పరీక్షల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను కనబర్చింది. దీంతో ఇటీవల వెలువడిన ఫలితాల్లో మెరుగైన ర్యాంకు సాధించడంతో కాకినాడ జిల్లాలోని పెద్దాపురంలోని నవోదయ పాఠశాలలో చదివేందుకు సీటు ఖరారైంది. ఆరో తరగతి నుంచి పదో తరగతి వరకూ ఉచిత విద్యను అభ్యసించనుంది. విద్యార్థిని స్వరిణి తల్లిదండ్రులైన సత్తిబాబు, శిరీషతో పాటు స్కూల్ యాజమాన్యాన్ని పలువురు అభినందించారు.

సడన్ బ్రేక్

- అర్ధంతరంగా నిలిచిన అమలాపురం బస్ టెర్మినల్ పనులు
- ఆరు నెలలైనా అతీగతీ లేని నిర్మాణం
- రూ.45 కోట్ల అంచనా వ్యయంతో జరిగిన శంకుస్థాపన
- కొత్త పాలకుల నిర్లక్ష్యంపై ప్రజల్లో అసంతృప్తి



ప్రయాణికులతో ఉన్న అమలాపురం బస్ కాంప్లెక్స్



అమలాపురంలో బస్ టెర్మినల్‌కు శంకుస్థాపన చేస్తున్న అప్పటి మంత్రి విశ్వరూప్, అప్పటి ఆర్టీసీ ఎండీ తిరుమలరావు తదితరులు (ఫైల్)

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కోనసీమ ప్రతిష్టను ఇనుమడించేలా రూపకల్పన చేసిన నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మాణంలో ఇసుమంతైనా పురోగతి లేదు. విజయవాడలో మాదిరిగా అత్యాధునిక వసతులతో ప్రతిపాదించిన నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మాణానికి ఈ ఏడాది ఫిబ్రవరి 14న అప్పటి రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆధ్వర్యంలో శ్రీకారం చుట్టారు. అమలాపురం ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో సుమారు రూ 45 కోట్ల అంచనా వ్యయంతో ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో అత్యాధునిక స్టేషన్, బస్సు కాంప్లెక్స్ టెర్మినల్ నిర్మించాల్సి ఉంది. అప్పటి ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సీహెచ్. ద్వారకా తిరుమలరావు, జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.గోపీనాథ్‌రెడ్డి వీటికి శంకుస్థాపన చేశారు.

జిల్లా స్థాయికి తగ్గట్టుగా అన్ని రకాల మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేసేలా అత్యాధునిక బస్ టెర్మినల్ నిర్మాణం కోసం తొలి దశలో రూ.5 కోట్లు రాష్ట్ర రవాణా శాఖ కేటాయించింది. ప్రస్తుతం ఉన్న కాంప్లెక్స్ భవనాన్ని తొలగించి, దాని స్థానే అత్యాధునిక బస్ టెర్మినల్‌ను 24 ప్లాట్‌ఫారాలతో పాటు, మూడు అంతస్తుల కమర్షియల్ కాంప్లెక్స్ బ్లాకుల నిర్మాణానికి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో టెండర్లు పిలిచారు. తొలి దశలో మంజూరైన రూ.5 కోట్లతో గ్రౌండ్ ఫ్లోర్ బస్ టెర్మినల్ పూర్తి చేసి, అందుబాటులోకి తెచ్చేందుకు నిర్ణయించారు. మూడు అంతస్తులను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో కమర్షియల్‌గా చేస్తున్నట్టు అప్పటి ఏపీఎస్ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు ప్రకటించారు. మంజూరైన రూ.5 కోట్లతో పాటు, మరో రూ.3 కోట్లు వెచ్చించి గ్రౌండ్ ఫ్లోర్ నిర్మాణం పూర్తి చేస్తామని అప్పట్లో తెలిపారు. తొలి రెండు ఫ్లోర్లకు పీపీపీ విధానంలో బిడ్డింగ్ కాల్ ఫర్ చేసి, నిర్మాణ ప్రతిపాదనలు చేశారు. కమర్షియల్ కాంప్లెక్స్‌ను డిమాండ్‌కు అనుగుణంగా నిర్మించాలని ప్రతిపాదనలు చేశారు.

బస్టాండ్‌కు ముంపు సమస్య

ఆవరణ అంతా పల్లంగా ఉండటంతో వర్షం వస్తే బస్టాండ్‌లో ముంపు సమస్య తలెత్తుతోంది. ముంపు నీరు బయటకు వెళ్లిందుకు అవుట్‌లెట్ లేకపోవడంతో ముంపు సమస్య తీవ్రంగా ఉంటోంది. భారీ వర్షాలకు ముంపు సమస్య వల్ల ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆవరణ మెరక చేసి, డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు చేశారు. తొలిదశలో మెరక పనులు, డ్రైనేజీ నిర్మాణంతో పాటు, బస్ స్టేషన్ నిర్మించాల్సి ఉంది. ఆరు నెలలుగా ఆయా పనులు ముందుకు కదలకపోవడంతో ప్రజానీకం పెదవి విరుస్తోంది. అలాగే బస్టాండ్ వద్ద ఆక్రమణల వల్ల డ్రైనేజీలు మూసుకుపోవడం ముంపు సమస్యకు కారణంగా చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు దీనిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

ముందుకు కదలని పనులు

ఈ ఏడాది ఫిబ్రవరి 14న బస్ టెర్మినల్‌కు శంకుస్థాపన జరిగింది. తొలిదశలో రూ.5 కోట్ల నిధులూ కేటాయించారు. ఆరు నెలలైనా పనులు ముందుకు కదలడం లేదు. పనులకు టెండర్లు పిలిచి, వాటిని ప్రారంభించే సమయంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం మారడంతో ఈ పనులు ఇప్పటివరకు ప్రారంభం కాలేదు. ఆర్టీసీ అధికారులను దీనిపై అడిగితే, తమ వద్ద సమాచారం లేదని ముక్తసరిగా సమాధానమిస్తున్నారు. అమలాపురం ఎంపీ, ఎమ్మెల్యేలు ఈ బస్‌స్టేషన్ నిర్మాణంపై దృష్టి సారించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

త్వరితగతిన పూర్తి చేయాలి

అమలాపురం అత్యాధునిక బస్ స్టేషన్ కాంప్లెక్స్ నిర్మాణానికి గత ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. ప్రయాణికుల అవసరాలు దృష్టిలో ఉంచుకుని ఈ పనులు త్వరితంగా చేపట్టాలి వర్షాకాలంలో బస్టాండ్ ముంపు బారిన పడి ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. వారి ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రభుత్వం ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి.

– కారెం వెంకటేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, వ్యవసాయ కార్మిక సంఘం, అమలాపురం

ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురంలో కోనసీమకే తలమానికంగా నూతన బస్ కాంప్లెక్స్ టెర్మినల్ ఉంటుంది. విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్టాండ్‌లా అత్యాధునిక వసతులతో బస్టాండ్ నిర్మాణానికి నిధులు కూడా కేటాయించారు. ఎన్నికల కోడ్ వల్ల పనులు ముందుకు సాగలేదు. ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలి.

– ఉండ్రు బాబ్జీ, ప్రయాణికుడు, అమలాపురం

అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలి



ఎన్.కొత్తపల్లిలో రక్షణ భవనాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ చిట్టికుమారి

ఉప్పలగుప్తం: ప్రజలంతా అంబేడ్కర్ అడుగు జాడల్లో నడవాలని సర్పంచ్ కుంచే చిట్టికుమారి అన్నారు. మండలంలోని ఎస్.కొత్తపల్లి పంచాయతీ పరిధిలోని కొబ్బరిపేట అంబేడ్కర్ విగ్రహానికి నూతనంగా ఏర్పాటు చేసిన రక్షణ భవనాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో దళిత నాయకులు కొంకి బాలకృష్ణ, కొంకి వెంకటబాబ్జీ, కొంకి రాజారావు, కుంచే చిన్ని, పొత్తూరి వెంకటపతిరాజు, నడింపల్లి వాసురాజు, ఆర్ఎస్ఎన్ రాజు, అంగాని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు పరదేశమ్మ అమ్మవారి జాతర



తాళ్లరేవులోని పరదేశమ్మ, ముత్యాలమ్మ అమ్మవార్లు

తాళ్లరేవు: కోరిన కోర్కెలు తీర్చే తాళ్లరేవు గ్రామ దేవత పరదేశమ్మ అమ్మవారి పెద్ద జాతర మహోత్సవం శనివారం రాత్రి నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. నెల రోజుల క్రితం అమ్మవారిని మార్కెట్ వీధిలోని అంగన్‌గుడిలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం అమ్మవారి జాతర, ఆదివారం అమ్మవారి తీర్థ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

చోరీల నియంత్రణపై అవగాహన సదస్సులు

తాళ్లరేవు: సమాజంలో అధికమైన దొంగతనాలు, దోపిడీలపై ప్రజలను అప్రమత్తం చేస్తూ కోరంగి పోలీసులు అవగాహనా సదస్సులు నిర్వహిస్తున్నారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఉత్తర్వుల మేరకు కాకినాడ డీఎస్పీ, కాకినాడ రూరల్ సీఐల ఆధ్వర్యంలో కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ అవగాహన కల్పించారు. శుక్రవారం కోరంగి పంచాయతీ గుడ్డివాని తూము సెంటర్‌లో వ్యాపారులు, ఆటోడ్రైవర్లు, ప్రజలకు అవగాహన కల్పించారు. శ్రావణ మాసం, పెళ్లిళ్లు అధికంగా ఉన్న నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్సై సూచించారు. ఇంటికి తాళాలు వేసేటప్పుడు బయటకు కనిపించకుండా జాగ్రత్త పడాలని, బంగారు వస్తువులు వాడుకకు ఉంచుకుని, మిగిలినవి లాకర్లలో పెట్టుకోవాలని సూచించారు. ఎస్సైతో పాటు, సిబ్బంది ఉన్నారు.

గాజుల గౌరీదేవిగా వేపచెట్టు కనక దుర్గమ్మ



వరలక్ష్మీ దేవిగా దర్శనమిస్తున్న అమలాపురం శ్రీదేవి అమ్మవారు



గాజుల గౌరీదేవి అలంకరణలో కనక దుర్గమ్మ



యానాం సావిత్రీనగర్‌లో కనక దుర్గమ్మ



మురమళ్లలో ప్రత్యేక అలంకరణలో వరలక్ష్మీదేవి



యానాంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మహిళలు

అమలాపురం టౌన్: కల్వకొలను వీధిలో ఉన్న వేపచెట్టు కనకదుర్గ ఆలయంలో అమ్మవారు గాజుల గౌరీదేవిగా శ్రావణ శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణానికి చెందిన బంగారు, వెండి వర్తకుడు పిండి శేషు, దీపికదేవి దంపతులు సమకూర్చిన 50 వేల గాజులతో అమ్మవారిని అలంకరించారు. వరలక్ష్మీదేవి వ్రతాన్ని పురస్కరించుకుని శుక్రవారం రోజున అమ్మవారితో పాటు, ఆలయమంతా రంగురంగుల మట్టి గాజులతో తీర్చిదిద్దారు. అమ్మవారికి పట్టు చీర, నగలు మాదిరిగా గాజులతో అలంకరించారు. ఆలయమంతా గాజుల దండలను తోరణాలుగా కట్టారు. ఆలయ అర్చకుడు సాయి ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమ పూజలు జరిగాయి. మూడు రోజుల పాటు అమ్మవారికి గాజుల గౌరీదేవి అలంకరణ కొనసాగుతుందని గాజుల దాతలు శేషు, దీపికదేవి దంపతులు తెలిపారు. అమ్మవారిని భారీ సంఖ్యలో భక్తులు దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

వరలక్ష్మీదేవిగా శ్రీదేవి అమ్మవారు

అమలాపురం టౌన్: శ్రావణ శుక్రవారం సందర్భంగా స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో అమ్మవారిని వరలక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని వేలాది మంది భక్తులు ఉదయం నుంచి దర్శించుకున్నారు. మహిళలు తమ ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించిన తర్వాత నేరుగా శ్రీదేవి అమ్మవారి ఆలయానికి వచ్చి, వరలక్ష్మీదేవి అమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. మరికొందరు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణ జరిగింది. అలాగే స్థానిక హౌసింగ్ బోర్డు కాలనీలోని కళ్యాణ కనకదుర్గమ్మ ఆలయంలో కూడా అమ్మవారిని వరలక్ష్మీదేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మ సన్నిధిలో మహిళలు వ్రతాలు చేశారు. ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

ఘనంగా వరలక్ష్మీ శుక్రవారం

ఐ.పోలవరం: శ్రావణ మాసం వరలక్ష్మీ శుక్రవారం కావడంతో మండలంలోని అన్ని అమ్మవారి దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పలుచోట్ల సామూహిక కుంకుమ పూజలు, వ్రతాలు నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల వద్ద భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు, వ్రతాలు చేశారు. మండలంలో మురమళ్ల, కొమరగిరి, ఎదుర్లంక, గుత్తినదీవి, కేశనకుర్రు, కేశనకుర్రుపాలెం, టి.కొత్తపల్లి, ఐ.పోలవరం తదితర గ్రామాల్లో కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో భక్తులు అమ్మవారికి మొక్కులు చెల్లించారు. అలాగే పలు ఆలయాల్లో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు చేశారు. మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో మహిళలు లలిత పారాయణ, విష్ణు సహస్ర నామం, భక్తి పాటలు ఆలపించారు.

ఆలయాలకు పోటెత్తిన మహిళలు

యానాం: శ్రావణ శుక్రవారం పర్వదినం సందర్భంగా వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. పలు దేవాలయాల్లోని అమ్మవార్లకు ఉదయం నుంచే పూజలు నిర్వహించడంతో భక్తులు కిటకిటలాడారు. పలుచోట్ల మహిళలు కుంకుమ పూజల్లో పాల్గొని, మొక్కులు చెల్లించుకున్నారు. సావిత్రీనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చారు. స్థానిక శివాలయం వీధిలో ఉన్న లలితాదేవి ఆలయంలో, గోపాల్‌నగర్‌లో శారదాదేవి ఆలయాలకు భక్తులు తరలివచ్చి, అమ్మవారికి పూజలు నిర్వహించారు. అదేవిధంగా శ్రీభూసమేత వేంకటేశ్వరస్వామి బాలాలయంలోనూ భక్తులు విశేష పూజలు నిర్వహించారు.

సుప్రీం తీర్పుపై 21న భారత్ బంద్

సమావేశమైన మాల మహానాడు జేఏసీ నేతలు



సమావేశంలో పాల్గొన్న మాల మహానాడు జేఏసీ నాయకులు

అమలాపురం రూరల్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ ఈ నెల 21న బుధవారం వివిధ ప్రజా, దళిత సంఘాలు సంయుక్తంగా భారత్ బంద్‌కు పిలుపునిచ్చినట్టు మాల మహానాడు జేఏసీ నాయకులు తెలిపారు. నడిపూడి దాబా గార్డెన్‌లో మాల మహానాడు జేఏసీ సభ్యుల సమావేశం శుక్రవారం జరిగింది. బంద్‌కు అన్ని వర్గాలు, చాంబర్ ఆఫ్ కామర్స్, విద్యాసంస్థలు, దుకాణదారులు, వాహన యూనియన్లు, ప్రభుత్వ రంగ సంస్థలు సహకరించాలని జేఏసీ నాయకులు పండు అశోక్‌కుమార్, ఎంఏకే భీమారావు, జగడం సత్యనారాయణ, జల్లి శ్రీనివాసరావు, ఉండ్రు బాబ్జీ కోరారు. వర్గీకరణ జరగకుండా ఉద్యమానికి సహకరించాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు చీకురుమిల్లి కిరణ్‌కుమార్, పెయ్యిల పరశురాముడు, పోతుల నాగరాజు, నాతి శ్రీనివాస్, నక్కా సంపత్‌కుమార్, కుంచే బాబులు, బొంతు రమణ, మెండు రమేష్, గెల్లా రాజేంద్ర, ఉబ్బన శ్రీను, మోకా శ్రీను, ఉటాల వెంకటేష్ సాధనల శ్రీను, మెండి డేవిడ్, పోతుమూడి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా డి జ్యూర్ బదిలీ దినోత్సవం



యానాం మున్సిపల్ పార్క్‌లో స్మారక స్థూపం వద్ద నివాళులర్పించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి డి జ్యూర్ బదిలీ దినోత్సవాన్ని శుక్రవారం యానాంలో ఘనంగా నిర్వహించారు. ఫ్రెంచి పాలిత ప్రాంతంగా ఉన్న యానాం, మాహే, కారైకల్, పుదుచ్చేరి రీజియన్లు 1962లో అధికారికంగా దేశంలో బదిలీ జరిగాయి. దీంతో నిజమైన స్వాతంత్ర్యం ఆగస్టు 16న పుదుచ్చేరికి వచ్చింది. ఫ్రెంచి, భారత ప్రభుత్వాల మధ్య సంతకం జరిగిన ఒప్పందాన్ని 1962 ఆగస్టు 16న ఫ్రెంచి పార్లమెంట్ ఆమోదించింది. అప్పటి వరకు ఫ్రెంచి వారి ఆధీనంలోనే ఈ నాలుగు రీజియన్లు ఉన్నాయి. అనంతరం డి జ్యూర్ (ఇండియన్ యూనియన్‌తో యూటీ లీగల్ విలీనం) అమల్లోకి వచ్చింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్థానిక మున్సిపల్ పార్క్‌లో ఉన్న స్మారక స్థూపం వద్ద ఆర్ఏఓ మునిస్వామి, ఎస్పీ రాజశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా డాక్టర్‌కు కొవ్వొత్తులతో శ్రద్ధాంజలి



అమలాపురంలో నిర్వహిస్తున్న కొవ్వొత్తుల ప్రదర్శన

అమలాపురం టౌన్: కోల్‌కతాలో మహిళా డాక్టర్‌పై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనలను నిరసిస్తూ, ఆమె ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థిస్తూ అమలాపరం ఆజాద్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక గడియారం స్తంభం సెంటరులో శుక్రవారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. వైద్యురాలి మృతికి నివాళులు అర్పించారు. ఆజాద్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు యల్లమిల్లి నాగసుధా కొండ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు అల్లాడ శరత్ మాట్లాడుతూ తమ వైద్యం ద్వారా ప్రాణాలు పోసే ఓ వైద్యురాలికే రక్షణ లేదంటే, సమాజంలో శాంతిభద్రతలు ఎంతటి క్లిష్టంగా మారాయో అవగతమవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఫౌండేషన్ ప్రతినిధులు ఈవని విశ్వేశ్వరశర్మ, రంకిరెడ్డి కాశీ, రాజకీయ పార్టీల నాయకులు మెకా వెంకటసుబ్బారావు, చింతపల్లి చిన్నా, కుడుపూడి వెంకట్, కొత్తపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అమలాపురం రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాన్యువల్ స్కావెంజర్ల సర్వే కమిటీలో సభ్యులుగా నియమించడానికి మాన్యువల్ స్కావెంజర్ల వెల్ఫేర్ స్వచ్ఛంద సంస్థల నుంచి, పారిశుధ్య కార్మికుల కమ్యూనిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతునట్టు జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి ఎం.జ్యోతి లక్ష్మీదేవి తెలిపారు. ఈ నెల 20లోపు దరఖాస్తులు చేయాలని ఓ ప్రకటనలో సూచించారు. ఇతర వివరాలకు సెల్ నంబరు 99086 95010లో సంప్రదించాలని కోరారు.

19న ప్రవేశ పరీక్ష

అల్లవరం: ఆరు నుంచి తొమ్మిదో తరగతి, ఇంటర్మీడియెట్ బైపీసీ గ్రూపుల్లో మిగిలిన సీట్ల భర్తీకి గోడి బాలురు గురుకులంలో ఎస్సీ విద్యార్థులకు ఈ నెల 19న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు విద్యార్థులు ఆధార్‌తో రావాలని, పరీక్ష అనంతరం ఫలితాలు వెల్లడిస్తామన్నారు. ఫలితాల్లో మార్కుల ఆధారంగా సీట్లు కేటాయిస్తామని వివరించారు. వివరాలకు 97045 50038, 99632 50626 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

మాతృ శాఖలో కలపాలని ఎన్ఎంల వినతి

అమలాపురం రూరల్: జిల్లాలో గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ఎన్ఎంలను మాతృశాఖలో కలపాలని కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్‌కు ఎన్ఎంలు వినతిపత్రం అందించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఎన్ఎంలా పనిచేస్తూ, అన్నిరకాలా నేషనల్ హెల్త్ ప్రోగ్రాముల్లో సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రతి బుధ, శనివారాల్లో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం, శుక్రవారం డ్రైడే–ఫ్రైడే, గర్భిణులు, బాలింతల రక్త పరీక్షలు, డెలివరీ కేసులు రిఫర్ వంటి పనులు చేస్తున్నామని వివరించారు. సచివాలయంలో కుల, ఓడీఎఫ్ సర్వే, ఫీవర్ సర్వేలు చేస్తున్నామన్నారు. ఇంకా 82 రకాల యాప్‌లో ఆన్‌లైన్ పనులు చేస్తున్నామని తెలిపారు. పెన్షన్లు, తమకు సంబంధించని అనేక సర్వేలు అప్పజెప్పి, వాటికి తమను బాధ్యుల్ని చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో నిర్దిష్ట సమయంలో వైద్య సేవలు పూర్తి కాకపోవడంతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. తమను మానసికంగా ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. తమను పంచాయతీరాజ్ శాఖ నుంచి మెడికల్ అండ్ హెల్త్ శాఖకు అప్పగించాలని వారు కోరారు.

పనులు ప్రారంభించకపోతే పోరాటం

పీడబ్ల్యూడీ మంత్రితో ఎమ్మెల్యే అశోక్



మంత్రితో సమావేశమైన ఎమ్మెల్యే అశోక్

యానాం: నియోజకవర్గ పరిధిలో ఉన్న పలు సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ కోరారు. ముఖ్యంగా ఎమ్మెల్యే ల్యాడ్ నిధులతో భూమిపూజలు చేసి, పనులు ప్రారంభించకుండా అధికారులు ఉద్దేశపూర్వకంగా జాప్యం చేస్తున్నారని మండిపడ్డారు. తక్షణం పనులు ప్రారంభించకపోతే ప్రజా పోరాటం ద్వారా మళ్లీ నిరసన దీక్షకు దిగుతానని పుదుచ్చేరి పీడబ్ల్యూడీ మంత్రి లక్ష్మీనారాయణకు ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ స్పష్టం చేశారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో ఆయన మంత్రిని కలిశారు. కురసాంపేట మురుగు కాలువ సమస్యను పరిష్కరించాలన్నారు. తక్షణం ఆ పనులకు టెండర్లు పిలిచి, వర్క్ ఆర్డర్లు ఇవ్వాలని కోరారు. దరియాలతిప్ప, దొమ్మేటిపేట, గిరియాంపేట, సావిత్రినగర్, కనకాలపేట మెట్టకూరు గ్రామాల్లో నీటి సరఫరా పైపులైన్లు పాడయ్యాయని, నూతన లైన్లు వేయాలని కోరారు. మత్స్యకారులకు ఓఎన్‌జీసీ ద్వారా రావాల్సిన తొమ్మిది నెలల పరిహారం త్వరగా మంజూరు చేయాలన్నారు. సింగిల్ ఉమెన్ పింఛను సమస్యను పరిష్కరించాలని కోరారు. నియోజకవర్గంలో పీడబ్ల్యూడీ శాఖ పనులకు శంకుస్థాపన చేసి, పనులు ప్రారంభించడం లేదని అధికారులపై ఫిర్యాదు చేశారు. ఇదే కొనసాగితే మళ్లీ ప్రజలతో కలిసి నిరసన దీక్షకు సిద్ధమవుతానని స్పష్టం చేశారు. దీనికి స్పందించిన ఆయన పెండింగ్‌లో ఉన్న పనులకు సంబంధించిన ఫైలును తక్షణం తన వద్దకు పంపాలని అధికారులకు మంత్రి లక్ష్మీనారాయణ ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో ఆర్ఏఓ మునిస్వామి, పీడబ్ల్యూడీ ఏఈ నాగరాజు పాల్గొన్నారు.

ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

తాళ్లరేవు: కొత్త ఎంపీడీఓగా ఎం.అనుపమ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో తాళ్లరేవులో పనిచేసిన ఆమె సార్వత్రిక ఎన్నికల ముందు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం తిరిగి ఇక్కడ ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెను ఎంపీపీ రాయుడు సునీత, కార్యాలయ ఏఓ చింతా మోహనకృష్ణ, ఈఓపీఆర్డీ ఎం.భైరవమూర్తి, పంచాయతీ, సచివాలయాల కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

పలువురికి ఉత్తమ సేవా పురస్కారాలు







మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ కృష్ణారావు చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న వీఆర్వో శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ శ్రీకాంత్, విజయకుమార్

అమలాపురం టౌన్: ఉత్తమ సేవలకు గుర్తింపుగా స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్థానిక బాలయోగి స్టేడియంలో గురువారం జరిగిన వేడుకల్లో ఇద్దరికి పురస్కారాలు లభించాయి. అమలాపురం పట్టణ వీఆర్వో కేవీఎస్‌జేఆర్ శ్రీనివాస్, తహసీల్దార్ కార్యాలయ జూనియర్ అసిస్టెంట్ డీఎస్ శ్రీకాంత్‌కు ఉత్తమ సేవా పురస్కారాల ప్రదానం జరిగింది. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, కలెక్టర్ రావిరాల మహేష్ కుమార్, జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు చేతుల మీదుగా వారు పురస్కారాలు అందుకున్నారు.

లైన్‌మన్‌కు ఉత్తమ పురస్కారం

ఉప్పలగుప్తం: విధుల్లో ఉత్తమ సేవలు అందించిన గొల్లవిల్లి విద్యుత్ లైన్‌మన్ ఎస్ విజయకుమార్‌కు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మంత్రి, కలెక్టర్ చేతుల మీదుగా ఆయన పురస్కారం అందుకున్నారు. ఆయనను ట్రాన్స్‌కో, ఏపీఈపీడీసీఎల్ అధికారులు, సిబ్బంది, ప్రముఖులు, గ్రామస్తులు శుక్రవారం అభినందించారు.